క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవారు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

హ్యాండ్‌బ్యాగు అప్పగింత



బ్యాగును భక్తురాలికి అందిస్తున్న ఏఈఓ మధు, సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి

మహానంది: మార్కాపురం పట్టణానికి చెందిన కృష్ణవేణి, కుటుంబ సభ్యులు ఆదివారం మహానందికి వచ్చారు. చిన్నకోనేరుల వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తుండగా హ్యాండ్‌బ్యాగు పోగొట్టుకుపోయింది. దీంతో వారు సమాచారం కేంద్రం వద్దకు చేరుకుని సిబ్బంది మధు దృష్టికి తీసుకెళ్లారు. వారు మైకుల్లో అనౌన్స్ చేయడంతో స్పందించిన హోంగార్డు కోటయ్య బ్యాగుకోసం వెతికాడు. దొరకడంతో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డిల సమక్షంలో భక్తురాలికి అందించారు. బ్యాగులో రూ. 8,010 నగదు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామ శివారులోని ఆవులడొంగు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు చేయగా నాటుసారా బెల్లం, డ్రమ్ములు లభించాయన్నారు. వాటిని ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారీ చేసినా, అమ్మకాలకు పాల్పడినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

మహిళను కాపాడిన పోలీసులు



మహిళను బంధువులకు అప్పగించిన పోలీసులు

శ్రీశైలంటెంపుల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలని వచ్చిన మహిళను శ్రీశైలం పోలీసులు కాపాడారు. శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ జిల్లా పరిగి గ్రామానికి చెందిన లక్ష్మి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకునేందుకు శ్రీశైలం వచ్చింది. ఆమె సమాచారాన్ని లక్ష్మి భర్త చిన్నారెడ్డి, బంధువులు శ్రీశైలం సీఐకి తెలిపారు. తక్షణమే స్పందించిన సీఐ నైట్‌బీట్ కానిస్టేబుల్ వెంకటరమణను సదరు ప్రాంతానికి పంపి ఆమె ఆత్మహత్యయత్నాన్ని విఫలం చేసి సురక్షితంగా వారి బంధువులకు అప్పగించారు. శ్రీశైలం సీఐ, కానిస్టేబుల్‌లను పోలీసు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

● వణికిస్తున్న చలి

కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయి చలి వణికిస్తోంది. మంచు దుప్పటి కప్పేస్తోంది. గ్రామాల్లో తెల్లవారుజామున 8 గంటలు దాటినా పొగమంచు వీడడం లేదు. దీంతో ప్రజలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. వెచ్చదనం కోసం చలిమంటలు వేసుకుంటున్నారు. ఉదయం 10 గంటలైనా సూర్యుడు కనిపించడం లేదు. వాహనదారులు పగటి పూట లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి. ప్రకృతి ప్రేమికులకు మాత్రం మంచి అనుభూతిని అందిస్తోంది. -కొత్తపల్లి



పొలాలను కమ్మేసిన పొగ మంచు (ఇన్‌సెట్‌లో) చలి నుంచి ఉపశమనం కోసం మంటలు వేసుకున్న గ్రామస్తులు

■ నేలకు దిగొచ్చిన మేఘాలు

మహానంది: రోజులోనే ఎన్నో వర్ణాలతో కనువిందు చేసే గగనాన సాయం సంధ్య వేళలో ఆవిష్కృతమయ్యే అందాలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయి. మహానందిలో ఆదివారం సాయంత్రం మేఘాలు కనువిందు చేశాయి. నల్లటి మేఘాలు నేలపైకి దిగినట్లు కనిపించిన దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.



కనువిందు చేస్తున్న నల్లటి మేఘాలు

లక్ష్మాపురంలో ఆరని ‘షరాఫ్’ చిచ్చు

- ఈ నెల 2న టీడీపీ వర్గీయుల ఆధ్వర్యంలో వేలంపాట
- వేరే కాటా తెచ్చుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు
- సపరేట్ కాటా ఎలా తెచ్చుకుంటారని ఫోన్‌లో ఎస్ఐ ఆగ్రహం?
- స్టేషన్‌కు రావాలని గ్రామానికి పోలీసులను పంపిన వైనం



గ్రామ షరాఫ్ వేలం నిర్వహిస్తున్న టీడీపీ వర్గీయులు(ఫైల్)



వైఎస్సార్‌సీపీ వర్గీయులు తెచ్చుకున్న కొత్త కాటాతో ధాన్యం విక్రయిస్తున్న రైతు దేవేంద్ర

పగిడ్యాల: మండలంలో ఈనెల 2వ తేదీ అధికార పార్టీకి చెందిన మాండ్ర, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వర్గీయుల ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మాపురం గ్రామ షరాఫ్ వేలం ఆరని చిచ్చులా మారింది. ఆనవాయితీని పట్టించుకోకుండా పెత్తనం కోసం పాకులాడుతూ పోలీసుల అండతో ప్రతిపక్షం గొంతును నొక్కేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అరమరికలు లేకుండా అన్నదమ్ముల్లా ఉండే వారు నేడు కయ్యానికి కాలుదువ్వే పరిస్థితిని తీసుకొచ్చారు. ఇప్పటి వరకు అధికార పక్షం, ప్రతిపక్షం నుంచి కమిటీ ఏర్పడి గ్రామ పెద్ద మనుష్యులను ఎన్నుకోవడం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఎన్నికైన గ్రామ పెద్దలు షరాఫ్ డబ్బులతో రైతుల సమస్యలను పరిష్కరించి లెక్కలు రికార్డ్ చేసి ఏడాది చివరిలో రచ్చకట్టపై చర్చించేవారు. అయితే గ్రామ షరాఫ్ వేలంలో ప్రతిపక్షానికి ప్రాతినిధ్యం లేకుండా అధికార పార్టీ నాయకులే జనవరి 2వ తేదీ గ్రామ పెత్తనాన్ని హస్తగతం చేసుకోవడం పాఠకులకు విదితమే. దీంతో వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఆదివారం కొత్త కాటా తెచ్చుకుని ధాన్యం విక్రయాలు చేయసాగారు. ఇది జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై ముచ్చుమర్రి ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అధికార పక్షం చేసిన మౌఖిక ఫిర్యాదుతో స్పందించిన ఎస్ఐ సిబ్బందిని పంపి స్టేషన్‌కు రావాల్సిందిగా హుకుం జారీ చేసినట్లు వినికిడి. గ్రామంలో ఒక కాటా ఉండగా మరో కాటా ఎలా తెస్తారని ఫోన్‌లో వైఎస్సార్‌సీపీ వర్గీయులను నానా దుర్భాషలాడి అవమానపరిచినట్లు సమాచారం. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు అధికార పక్షానికి వత్తాసు పలికి ప్రతిపక్ష నాయకులపై జులుం ప్రదర్శించి బెదిరించడం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశమైంది. గ్రామ షరాఫ్ చట్టబద్ధం కాదని, దానికి తమకు ఎలాంటి సంబంధం లేదని కేవలం శాంతిభద్రతలను పర్యవేక్షించడమే తమ బాధ్యత అని జనవరి 2వ తేదీ నమ్మబలికిన పోలీసులు అధికార పార్టీ నేతలకు దాసోహం అనడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక నియంతృత్వంలో జీవిస్తున్నామో అర్థం కావడం లేదని అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకండి

వెలుగోడు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కం ప్రతిపాదించిన వార్షిక ఆదాయం, అవసరాలు, విద్యుత్ చార్జీలపై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరు కావాలని వినియోగదారులను విద్యుత్ శాఖ ఏఈ రవీంద్ర నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి, 10న కర్నూలు నుంచి ఏపీఈఆర్సీ ఉన్నతాధికారులు హైబ్రిడ్ విధానంలో అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. నంద్యాలలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో అభ్యంతరాలు తెలియజేయవచ్చన్నారు. ఉదయం 10.30 మధ్యాహ్నం ఒంటిగంట వరకు హాజరు కావచ్చన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు తెలుపవచ్చన్నారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. వాటిని త్వరితగతిన పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహానందిలో సండే సందడి



కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు

మహానంది: సెలవు రోజు కావడంతో ఆదివారం మహానందికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

వైభవంగా మహానందీశుడి కల్యాణోత్సవం

మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు ఆదివారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల ద్వారా కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి స్వామి, అమ్మవారి అనుగ్రహం పొందారు.



మహానందీశ్వరుడి దంపతులు

అతివేగంతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు

మహానంది: వాహనదారులు అతివేగంతో వెళ్తూ ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గాజులపల్లె, శ్రీనగరం గ్రామాల వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారులు రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవడంతో పాటు హెల్మెట్ ధరించాలన్నారు. నిదానంగా వెళుతూ సురక్షితంగా గమ్యం చేరాలని సూచించారు.

ప్రభుత్వ మోసపూరిత విధానాలను వ్యతిరేకించండి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశాన్ని పట్టణ నాయకులు ఎ.సురేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేసే విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. దేశంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే నాయకుడు ఉండాలన్న ఉద్దేశంతో జమిలీ ఎన్నికలు తెస్తున్నారన్నారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడమేనని విమర్శించారు. వక్ఫ్‌బోర్డు భూముల సమస్యపై వివాదం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఆ భూములు అప్పజెప్పాలని యత్నిస్తున్నారని, మత రాజకీయాలు చేస్తూ ప్రజలను వేధిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు మంజుల, డి.రామ్‌నాయక్, షేక్‌ఇస్మాయిల్, వీరన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

8న ప్రత్యేక స్వచ్ఛసేవా కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా ఈ నెల 8న స్వచ్ఛసేవా కార్యక్రమంలో భాగంగా క్షేత్రపరిధిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నట్లు శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఈఓ మాట్లాడుతూ క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజిస్తామన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి జోన్‌కు యూనిట్ అధికారులను, పర్యవేక్షకులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాడవీధులు, గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు, దర్శన క్యూ కాంప్లెక్స్, విరాళాల సేకరణ కేంద్రం, అన్నప్రసాద వితరణ భవన పరిసరాలు తదితర చోట్ల పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బందితో పాటు దుకాణా నిర్వాహకులు, సత్రాల సిబ్బంది, స్థానికులు పాల్గొని క్షేత్ర పరిశుభ్రతను కాపాడడంలో సహకరించాలని కోరారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ వెగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శుభ్రత పనులు చేపట్టారు. ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో తగిన ఏర్పాట్లు చేపటినట్లు ఆలయ నిర్వాకులు మధుసూదన్‌రెడ్డి, రంగనాయకులు, నరసింహులు తెలిపారు. గతేడాది వైకుంఠ ఏకాదశికి లక్ష మంది భక్తులు వచ్చారని, ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని, వారిని దృష్టిలో ఉంచుకొని వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

అన్నదాతలను దగా చేసిన ప్రభుత్వం

నందికొట్కూరు: రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. మహిళా సంఘం జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి, కార్మిక సంఘం నాయకులు మస్తాన్‌వలీ, ఆనంద్ కుమా ర్, వెంకటస్వామి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యాప్‌లతో రైతులకు ప్రయోజనం



యాప్‌లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

వెలుగోడు: కృత్రిమ మేధ ద్వారా ఎన్‌పీఎస్‌ఎస్, పీడీఎస్ఎస్ యాప్‌ల ద్వారా రైతులకు క్షేత్రస్థాయిలో మేలైన పంట యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై సరైన సూచనలు, సలహాలు అందుతాయని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. వెలుగోడు గ్రామంలో రబీలో సాగుచేసిన మినుము పంటను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవం ద్వారా మరింత నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చన్నారు. రసాయన రహిత సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి పొందడమే కాకుండా నేలలో కర్బన శాతం, సూక్ష్మ పోషకాలు అధికంగా పెరుగుతాయని తెలిపారు. వరి కోత అనంతరం రెండవ పంటగా పెసర, మినుము లాంటి అపరాలు లేదా చిరుధాన్యాలు జొన్న మొక్కజొన్న వంటివి సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి పయనం

పాములపాడు: విజయవాడలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావానికి మండలం నుంచి హిందువులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. అంతకు ముందు స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాములపాడుతో పాటు వివిధ గ్రామాల నుంచి సుమారు 150 మంది రెండు బస్సులు, కార్లలో బయల్దేరి వెళ్లారు.



పాములపాడు నుంచి తరలివెళ్తున్న హిందువులు

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఓబులేసు

మిడుతూరు: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఓబులేసు హెచ్చరించారు. ఆదివారం నంద్యాల ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజామున పీరుసాహెబ్ పేట గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ చిన్నపాటి విషయాలకు గొడవపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించడం కొందరు పనిగా పెట్టుకున్నారని, అలాంటి వారిపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పిల్లల చదువులపై దృష్టిపెట్టి వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు లోనుకావొద్దని చెప్పారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించే వారి సమాచారం అందిస్తే గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించారు. బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు ఎస్ఐలు తిరుపాలు, చంద్రశేఖర్, ఏఎస్ఐలు, పాల్గొన్నారు.

ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నంద్యాల డివిజన్ పరిధిలోని బీసీ హాస్టళ్లలో నిర్వహించే ప్రేరణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి ముస్తాక్ అహమ్మద్ కోరారు. స్థానిక బీసీ హాస్టల్‌లో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన అధ్యాపకులతో తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించి బీసీ సంక్షేమ శాఖకు పేరు తీసుకొని రావాలని సూచించారు. వార్డెన్లు సువర్ణ, హరిత, చైతన్యలక్ష్మి, మద్రమ్మ, వేణుగోపాల్, సురేష్ పాల్గొన్నారు.

వార్డులను శుభ్రంగా ఉంచండి

నందికొట్కూరు: మురుగు కాలువల నుంచి దుర్వాసన రాకుండా, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా వార్డులను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ బేబి సూచించారు. ఆదివారం పట్టణంలోని 4వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా మురుగు కాలువల నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడిక ఏర్పడకుండా శుభ్రం చేయాలన్నారు. అపరిశుభ్రంగా ఉంటే రోగాలు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రజలు తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న యువత

నంద్యాల(న్యూటౌన్): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం నంద్యాల జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు యువజన సర్వీసుల శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించారు. పోటీలకు 15- 29 సంవత్సరాల వయస్సున్న వారు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ తన బోధనల ద్వారా భారత దేశ ఖ్యాతిని వివేకానంద విశ్వవ్యాప్తం చేశారన్నారు. సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వామి వివేకానంద జీవిత సందేశంపై పోటీలు నిర్వహించామని చెప్పారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు లలితాసరస్వతి, శంకర్, నాగేంద్ర, ముఖ్య కార్య నిర్వహణ అధికారి దీప్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరుప్పావై పాశురం

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సంజీవనగర్ రామాలయంలో ఆదివారం శ్రీభగవత్ సేవా సమాజ్, తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 21వ రోజు పాశురాన్ని భక్తులకు వివరించారు. హయగ్రీవాచారి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు ఆవులాంటివాడని, అవిచ్ఛిన్నమైన పాలధారలా జ్ఞానాన్ని ప్రసరింపజేస్తారని, జ్ఞానం అనే ఆ పాలను నింపుకొనే పాత్రలే శిష్యులని నేటి పాశురం విశిష్టత గురించి భక్తులకు వివరించారు. అనంతరం ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు పర్యవేక్షణ అధికారి రంగ రామానుజాచార్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటిస్తూ పది మందికి తెలియజేయాలని, శ్రీకృష్ణ భగవానుల విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం ఆయనను ఆలయ నిర్వాహకులు సూరయ్య, హయగ్రీవాచార్యులు శాలువాతో సన్మానించారు. మధుసూదన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



రంగరామానుజాచార్యులను సన్మానిస్తున్న దృశ్యం